జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## భద్రాద్రి కొత్తగూడెం
శనివారం | 1 | ఆగస్టు | 2026 ◆ పేజీలు : 6

## ప్రత్యేక ఓటరు జాబితా సవరణను వేగవంతంగా పూర్తి చేయాలి: ఎమ్మెల్యే



**ఇల్లెందు, జులై 31 (ప్రజా జ్యోతి)**ప్రత్యేక ఓటరు జాబితా సవరణను వేగవంతంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య సూచించారు. శుక్రవారం స్థానిక రాజస్థాన్ ఫంక్షన్ హాల్ లో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై ఐదు మండలాలలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులతో అధికారులు శుక్రవారం సమావేశం నిర్వహించారు. ముందుగా ఇల్లందు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో జరుగుతున్న

మిగతా 2 లో...

# ఉగ్రరూపం దాల్చిన గోదావరి

- 48 అడుగులకు చేరిన నీటిమట్టం
- భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ
- లోతట్టు ప్రాంతాలపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి..
- క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించిన కలెక్టర్ అంకిత్, ఎస్పి రోహిత్ రాజు



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూలై 31, ప్రజాజ్యోతి:** ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరికి వరద ఉద్ధృతి రోజు రోజుకూ పెరుగుతోంది. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం శుక్రవారం 48 అడుగులకు చేరుకోవడంతో అధికారులు రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. ప్రస్తుతం భద్రాచలం వద్ద నుంచి సుమారు 11,44,645 క్యూసెక్కుల వరద నీరు దిగువకు ప్రవహిస్తోంది. ఇదే ఉద్ధృతి కొనసాగితే శుక్రవారం రాత్రికి గోదావరి నీటిమట్టం 53 అడుగులకు చేరుకునే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆ స్థాయికి చేరుకుంటే మూడో, చివరి ప్రమాద హెచ్చరికను జారీ చేయాల్సి ఉంటుంది. వరద పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 49 పునరావాస కేంద్రాలను సిద్ధం చేశారు. భద్రాచలంలో 9, దుమ్ముగూడెంలో 5, చర్లలో 8 కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే ఇప్పటివరకు భద్రాచలం పట్టణంలోకి వరద నీరు ప్రవేశించకపోవడంతో ఎవరినీ పునరావాస కేంద్రాలకు తరలించాల్సిన పరిస్థితి రాలేదని అధికారులు తెలిపారు. మరోవైపు వరద ప్రభావం ఇప్పటికే పలు ప్రాంతాల్లో కనిపిస్తోంది. కొన్ని లోతట్టు ప్రాంతాల్లో రహదారులపైకి వరద నీరు చేరడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు

మిగతా 2 లో...

## గోదావరి వరద ఉధృతిపై ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాలి

- మూడవ ప్రమాద హెచ్చరిక జారీ అయ్యే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యలను వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్, జులై 31,(ప్రజాజ్యోతి)** గోదావరి నదిలో వరద ఉధృతి మరింత పెరుగుతున్న నేపథ్యంలో భద్రాచలం వద్ద మూడవ ప్రమాద హెచ్చరిక జారీ అయ్యే అవకాశం ఉన్నందున అన్ని శాఖల అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండి ముందస్తు చర్యలను మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. భద్రాచలం డివిజన్ పరిధిలోని చర్ల, దుమ్ముగూడెం, భద్రాచలం, అశ్వాపురం, మణుగూరు, బూర్గంపాడు మండలాలకు చెందిన గోదావరి పరివాహక ప్రాంతాల అధికారులతో జిల్లా కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ ద్వారా వరద పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గోదావరి ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల

మిగతా 2 లో...

## దమ్మపేట మండలంలో ఎమ్మెల్యే జారే విస్తృత పర్యటన



- అంగన్ వాడీలు, పాఠశాలలు, పంచాయతీ–వీఓ భవనాల పరిశీలన
- సీఎంఆర్ ఎఫ్ చెక్కుల పంపిణీ

2 లో...

## చదువులో ముందంజ... సదుపాయాల్లో వెనుకంజ!

- ఇద్దరు ఉపాధ్యాయుల కృషితో ఆదర్శంగా నిలిచిన పాఠశాల
- ఆటస్థలం లేక.. నీటి నిల్వల మధ్యనే చిన్నారుల విద్యాభ్యాసం
- ప్రహరీ గోడ, మరుగుదొడ్డి నిర్మాణం పూర్తి చేసి మౌలిక వసతులు కల్పించాలని విజ్ఞప్తి




2 లో..

## ఉగ్రరూపం దాల్చిన గోదావరి..



(మొదటి పేజీ తరువాయి...)

ఎదుర్కొంటున్నారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్న అధికారులు సహాయక చర్యలను వేగవంతం చేశారు. ఇదిలా ఉండగా గోదావరి వరద పరిస్థితిని జిల్లా కలెక్టర్ అంకిత్ శుక్రవారం సాయంత్రం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సారపాక–రెడ్డిపాలెం ప్రధాన రహదారిని సందర్శించిన ఆయన, గోదావరి నీటిమట్టం మరింత పెరిగితే ఆ మార్గంపై కూడా వరద నీరు చేరి రాకపోకలు నిలిచిపోయే అవకాశం ఉందని అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ అవసరమైతే వెంటనే బ్యారికేడ్లు ఏర్పాటు చేసి వాహనాలు, ప్రజలు ఎవరూ ఆ మార్గంలో ప్రయాణించకుండా పోలీసు, రెవెన్యూ అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం తూర్పాక–దుమ్ముగూడెం ప్రధాన రహదారిని పరిశీలించిన కలెక్టర్, ఇప్పటికే వరద నీరు చేరడంతో రాకపోకలను నిలిపివేసి రహదారిని మూసివేసినట్లు అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన బ్యారికేడ్ల వద్ద నిరంతరం పోలీసు బందోబస్తు కొనసాగించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజలు వరద నీటిలోకి వెళ్లకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు నిరంతరం పరిస్థితిని సమీక్షిస్తూ అవసరమైన చర్యలను వెంటనే అమలు చేయాలని, గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా యంత్రాంగం విజ్ఞప్తి చేసింది.

## ప్రత్యేక ఓటరు జాబితా సవరణను వేగవంతంగా పూర్తి చేయాలి

(మొదటి పేజీ తరువాయి...)

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పురోగతిని మండలాల వారీగా వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంకా పూర్తి కాని ఇంటింటి వివరాల సేకరణ దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేసి ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను కోరారు. కాంగ్రెస్ పార్టీ ఓటరు జాబితా ప్రతినిధులు ఇంటింటి వివరాల సేకరణ ప్రక్రియలో అధికారులకు పూర్తి సహకారం అందిస్తారని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, జిల్లా కాంగ్రెస్ నాయకుడు కోరం సురేందర్, మాజీ మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు బోళ్ళ సూర్యం, మండల రాము, కామేపల్లి, గార్ల, టేకులపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులు గుజ్జర్లపూడి రాంబాబు, తాళ్లపల్లి కృష్ణగౌడ్, లక్కినేని శ్యాంబాబు, ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చదువులో ముందంజ... సదుపాయాల్లో వెనుకంజ!





**అన్నపురెడ్డిపల్లి, జూలై 31 (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండలంలోని వెంకటాపురం సీపీఎస్ ప్రాథమిక పాఠశాల విద్యా బోధనలో ఆదర్శంగా నిలుస్తున్నప్పటికీ, మౌలిక సదుపాయాల లేమితో విద్యార్థులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో 20 మంది విద్యార్థులు చదువుతుండగా, ఇద్దరు ఉపాధ్యాయులు తమ అంకితభావంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తూ పాఠశాలను అభివృద్ధి దిశగా నడిపిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఈ పాఠశాలలో 20 మంది విద్యార్థులు కొనసాగడం ఉపాధ్యాయుల కృషికి నిదర్శనంగా నిలుస్తోంది. అయితే పాఠశాలలో రెండు తరగతి గదులు మాత్రమే ఉండగా, విద్యార్థులు ఆడుకోవడానికి కనీస ఆటస్థలం కూడా లేదు. పాఠశాల గ్రామంలోని నీటి ట్యాంకు సమీపంలో దిగువ ప్రాంతంలో ఉండటంతో ట్యాంకు నిండిన ప్రతిసారి నీరు పాఠశాల ఆవరణలోకి చేరి నిల్వ ఉంటుంది. దీంతో ప్రాంగణమంతా గడ్డి పెరిగి విద్యార్థులు బయటకు రావడానికి, ఆటలు ఆడడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలకు ప్రహరీ గోడ కూడా లేకపోవడంతో విద్యార్థుల భద్రతపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాత మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరుకోగా, కొత్త మరుగుదొడ్డి నిర్మాణానికి అనుమతి లభించినప్పటికీ పనులు ప్రారంభించి మధ్యలోనే నిలిపివేశారు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాల ప్రాంగణంలో నిలిచే నీటి సమస్యపై ఉపాధ్యాయులు గ్రామ పంచాయతీ అధికారులకు పలుమార్లు తెలియజేసినా ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం లభించలేదు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పాఠశాల ప్రాంగణంలోని నీటి నిల్వను వెంటనే తొలగించడం, ఆటస్థలం ఏర్పాటు చేయడం, ప్రహరీ గోడ నిర్మించడం, అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్డి నిర్మాణాన్ని పూర్తి చేయడంతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని గ్రామస్థులు, తల్లిదండ్రులు సంబంధిత అధికారులను కోరుతున్నారు. నాణ్యమైన విద్య అందిస్తున్న ఈ పాఠశాలకు అవసరమైన వసతులు కల్పిస్తే విద్యార్థులకు మరింత మెరుగైన విద్యా వాతావరణం ఏర్పడుతుందని వారు అభిప్రాయపడుతున్నారు.

## గోదావరి వరద ఉధృతిపై ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాలి

(మొదటి పేజీ తరువాయి...)

కారణంగా వరద ప్రవాహం గంట గంటకు పెరుగుతోందన్నారు. సమ్మక్క బ్యారేజ్ వద్ద సుమారు 14.6 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్న నేపథ్యంలో భద్రాచలం వద్ద మూడవ ప్రమాద హెచ్చరిక జారీ అయ్యే అవకాశం ఉందని, దీనిని దృష్టిలో ఉంచుకుని ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ పూర్తి అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. గోదావరి పరివాహక ప్రాంతాల్లోని లోతట్టు గ్రామాలను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రమాదం సంభవించే అవకాశమున్న ప్రాంతాల ప్రజలను ముందుగానే సురక్షిత పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు. గ్రామాల్లో టామ్ టామ్ నిర్వహించి ప్రజలను అప్రమత్తం చేయాలని, అధికారులు ఇచ్చే సూచనలను తప్పనిసరిగా పాటించేలా విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. గర్భిణీలు, వృద్ధులు, దివ్యాంగులు, చిన్నారులకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ వారిని ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ ఇప్పటివరకు 17 మంది గర్భిణీలను సురక్షితంగా ఆరోగ్య కేంద్రాలకు తరలించామని, మరో 10 మందిని తరలించే ప్రక్రియ కొనసాగుతోందని కలెక్టర్ కు వివరించారు. గోదావరి పరివాహక ప్రాంతాల్లో అవసరమైన వైద్య సేవలు అందుబాటులో ఉండేలా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంబులెన్స్ లు, అత్యవసర మందులు సిద్ధంగా ఉంచాలని, వైద్యులు, వైద్య సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. వరద నీరు రహదారులపైకి వచ్చే అవకాశమున్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి బారికేడ్లు ఏర్పాటు చేయాలని, పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖలు సమన్వయంతో పటిష్ఠ పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. వాగులు, వంకలు, వరద నీటితో నిండిన రహదారులను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజలు దాటకుండా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ప్రజలు పర్యాటక ప్రాంతాలు, జలపాతాలు, వాగులు, నదీ తీర ప్రాంతాలకు వెళ్లకుండా అటవీశాఖ అధికారులు పోలీసు శాఖతో సమన్వయం చేసుకొని పటిష్ఠ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రమాదకర ప్రాంతాల్లో బారికేడ్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ఎట్టి పరిస్థితుల్లోనూ సందర్శకులను అనుమతించరాదని స్పష్టం చేశారు. వరద ప్రభావానికి గురయ్యే అవకాశమున్న వృద్ధాశ్రమాలు, పాఠశాలలు, విద్యాలయ వసతి గృహాలను ముందుగానే గుర్తించి అక్కడ ఉన్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులు, వృద్ధులు, ఇతర బలహీన వర్గాల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. పునరావాస కేంద్రాల్లో తాగునీరు, పరిశుభ్రమైన భోజనం, విద్యుత్, పారిశుద్ధ్యం, మరుగుదొడ్లు, వైద్య సేవలు, మహిళలు, చిన్నారులు, వృద్ధులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. భద్రాచలం పట్టణంలో వరద ప్రభావిత ప్రజల కోసం మొత్తం తొమ్మిది పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అవసరమైతే అదనపు పునరావాస కేంద్రాలను కూడా సిద్ధంగా ఉంచాలని సూచించారు. పునరావాస కేంద్రాలకు తరలించిన ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రతి గ్రామంలో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని, ప్రతి అధికారి క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి వరద పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ప్రజల ప్రాణ భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు చర్యలను మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. టెలి కాన్ఫరెన్స్ లో సంబంధిత శాఖల జిల్లా అధికారులు, భద్రాచలం డివిజన్ పరిధిలోని ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, పోలీసు, వైద్య ఆరోగ్య, అటవీ, రెవెన్యూ, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# దమ్మపేట మండలంలో ఎమ్మెల్యే జారే విస్తృత పర్యటన..

**దమ్మపేట, జూలై 31 (ప్రజాజ్యోతి):** గ్రామీణాభివృద్ధి పనుల పురోగతి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలును క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ శుక్రవారం దమ్మపేట మండలంలో విస్తృతంగా పర్యటించారు. పలు గ్రామాల్లో కొనసాగుతున్న నిర్మాణ పనులను పరిశీలించడంతో పాటు అంగన్ వాడీ కేంద్రాలు, పాఠశాలలను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. జగ్గారం గ్రామపంచాయతీ పరిధిలోని కొడిశలగూడెం, జగ్గారం అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించిన ఎమ్మెల్యే చిన్నారులకు అందుతున్న పోషకాహారం, ప్రాథమిక సౌకర్యాలు, విద్యా బోధనపై ఆరా తీశారు. అనంతరం





శ్రీరాంపురం గ్రామానికి చెందిన బోగి సారధకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ ఎఫ్) చెక్కును అందజేసి ప్రభుత్వం బాధిత కుటుంబాలకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. శ్రీరాంపురంలో నిర్మాణంలో ఉన్న నూతన గ్రామపంచాయతీ భవనాన్ని పరిశీలించిన ఆయన, పనుల్లో నాణ్యతకు ఎలాంటి రాజీ ఉండకూడదని అధికారులను ఆదేశించారు. మొండివర్రెలో నిర్మిస్తున్న వీఓ భవనం, పాత చీపురుగూడెంలో నూతనంగా నిర్మించిన వీఓ భవనాన్ని సందర్శించి పనుల స్థితిగతులను తెలుసుకున్నారు. నాగుపల్లి అంగన్ వాడీ కేంద్రంలో చిన్నారులతో ముచ్చటించిన ఎమ్మెల్యే, వారి విద్య, ఆరోగ్యం, మౌలిక సదుపాయాలపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నాగుపల్లి ఎంపీపీఎస్ పాఠశాలలో నిర్మిస్తున్న కాంపౌండ్ వాల్ పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. మల్కారం గ్రామపంచాయతీ పరిధిలోని గుత్తావారిగూడెంలో నూతనంగా నిర్మించిన అంగన్ వాడీ భవనాన్ని సందర్శించి అక్కడి సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన మౌలిక వసతులు కల్పించడం, విద్య, మహిళా–శిశు సంక్షేమం, గ్రామాభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రతి గ్రామం అభివృద్ధి చెందడమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ పర్యటనలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మద్దిశెట్టి సత్యప్రసాద్, వాసం శ్రీను, మాజీ సర్పంచ్ మడకం రాజేష్, జగ్గారం సర్పంచ్ వంకా జానకి రాముడు, అకంపాలెం సర్పంచ్ గురిమూర్తి, శ్రీరాంపురం సర్పంచ్ కె. రాజశేఖర్, నాగుపల్లి ఉప సర్పంచ్ కుంపటి వేణు, మారప్పగూడెం సర్పంచ్ పూనెం వెంకటేశ్వరరావు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాక రమేష్, పీఆర్ డీఈ శ్రీధర్, పీఆర్ ఏఈ ఝుంకీలాల్, ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పే స్కేల్ అమలు కై వీఆర్పీల పెన్‌డౌన్



**చర్ల, జూలై 31 (ప్రజాజ్యోతి):** తెలంగాణ గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో పనిచేస్తున్న విలేజ్ రిసోర్స్ పర్సన్ (వీఆర్ పీ) ఉద్యోగులు తమ ప్రధాన డిమాండ్ అయిన వేతన శ్రేణి (పే స్కేల్) అమలు చేయాలని కోరుతూ శుక్రవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా పెన్ డౌన్ ఆందోళనను ప్రారంభించారు. గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల అమలులో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నప్పటికీ, ఇప్పటి వరకు తమకు వేతన శ్రేణి అమలు చేయకపోవడంతో తీవ్ర అసంతృప్తి నెలకొందని ఉద్యోగులు తెలిపారు.రెండు సంవత్సరాల క్రితం గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ వేతన శ్రేణి అమలుపై సానుకూల ప్రకటన చేసినప్పటికీ, ఇప్పటి వరకు ఆ హామీ అమలులోకి రాలేదని వారు పేర్కొన్నారు.ఈ విషయమై ప్రభుత్వానికి పలుమార్లు వినతి పత్రాలు సమర్పించినప్పటికీ సమస్యకు పరిష్కారం లభించకపోవడంతో ప్రజాస్వామ్యబద్ధంగా కలం దించివేత ఆందోళన చేపట్టినట్లు వీఆర్ పీ సంయుక్త కార్యాచరణ కమిటీ (జేఏసీ) ప్రతినిధులు తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించాలని చర్ల ఎంపీడీవో ఈదయ్యకు వినతి పత్రం అందజేశారు.వీఆర్ పీ ఉద్యోగుల న్యాయమైన వేతన శ్రేణి డిమాండ్ ను వెంటనే అమలు చేసి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని జేఏసీ ప్రభుత్వాన్ని కోరింది.

## ప్రపంచ ఆదివాసీ దినోత్సవ సభకు ఎమ్మెల్యే కోరం కనకయ్యకు ఆహ్వానం

**టేకులపల్లి,జూలై 31,ప్రజాజ్యోతి:** ఆగస్టు 9న కొత్తగూడెం క్లబ్‌లో నిర్వహించనున్న ప్రపంచ ఆదివాసీ (గిరిజన) దినోత్సవ సభకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, జిల్లా కాంగ్రెస్ నాయకుడు కోరం సురేందర్‌ను లంబాడి హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) –నంగారా భేరి రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్ నాయక్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా గిరిజన హక్కుల పరిరక్షణకు సంబంధించిన డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. తండాలను రెవెన్యూ గ్రామాలుగా గుర్తించడం, పోడు, లావణి భూములకు శాశ్వత హక్కులు కల్పించడం, ఐదో షెడ్యూల్ అమలు, ఎస్టీ రిజర్వేషన్ల పెంపు, గోర్బోలి భాషకు గుర్తింపు, దేశవ్యాప్తంగా బంజారాలను ఎస్టీ జాబితాలో చేర్చడం వంటి అంశాలపై రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల వద్ద చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పంతుల్య నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి కుశ నాయక్, నాగేశ్వరరావు నాయక్, సాయి నాయక్, కిషన్ నాయక్, సీతారామ్ నాయక్, భద్రం నాయక్ తదితరులు పాల్గొన్నారు.





## దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి వి.బి/గ్రామ్‌జి ఉద్యోగుల నిరసన

- **పే స్కేల్, ప్రమోషన్లు, బదిలీలు, ఖాళీల భర్తీపై ప్రభుత్వాన్ని కోరిన ఉద్యోగులు**



**టేకులపల్లి,జూలై31,ప్రజాజ్యో తి:** దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు టేకులపల్లి మండల పరిషత్ కార్యాలయంలో వి.బి/గ్రామ్‌జి (వీబీజీ /రామ్జి) ఉద్యోగులు శుక్రవారం శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహించారు. విధులకు ఎలాంటి అంతరాయం కలగకుండా కార్యాలయ ఆవరణలో నిరసన చేపట్టి తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ, ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న పే స్కేల్‌ను తక్షణమే అమలు చేయడంతో పాటు అర్హులైన ఉద్యోగులకు ప్రమోషన్లు కల్పించాలని, ఉద్యోగుల బదిలీలను పారదర్శకంగా చేపట్టాలని, మితిమీరిన పని భారాన్ని తగ్గించే చర్యలు తీసుకోవాలని, అలాగే ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేసి గ్రామీణాభివృద్ధి శాఖలో సేవలను మరింత సమర్థవంతంగా నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.తమ సమస్యలను ప్రభుత్వం, ఉన్నతాధికారులు సానుకూలంగా పరిశీలించి వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో రాష్ట్ర నాయకత్వం ఆదేశాల మేరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఉద్యోగులు హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో అదనపు కార్యక్రమ అధికారి కాళంగి శ్రీనివాస్, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ ఎం. తిరుపతి, టీఏలు బీముడు, వెంకటరమణ, సురేష్, చాంద్‌మాల్, స్వప్న ఈశ్వరి, కంప్యూటర్ ఆపరేటర్లు సురేష్, అరుణ తదితరులు పాల్గొని ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లకు మద్దతు ప్రకటించారు. ప్రభుత్వంతో చర్చలు జరిపి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని వారు కోరారు.

## జైల్ భరోను విజయవంతం చేయండి

- **సీఐటీయూ, రైతు సంఘాల పిలుపు**



**చర్ల, జూలై 31:(ప్రజాజ్యోతి):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆగస్టు 10న నిర్వహించనున్న జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, సీఐటీయూ నాయకులు ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం చర్ల మండలంలోని పలు గ్రామాల్లో విస్తృత ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బందెల చంటి, రైతు సంఘం మండల కార్యదర్శి నల్లగట్ల నర్సింహమూర్తి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తూ ప్రజా ఆస్తులను ప్రైవేటీకరిస్తోందని ఆరోపించారు. ప్రజల ఓట్లతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసమే కార్మిక చట్టాల్లో మార్పులు చేసిందని విమర్శించారు.29 కార్మిక చట్టాలను మార్చడం వల్ల ఎనిమిది గంటల పని హక్కు, ఉద్యోగ భద్రత, కనీస వేతన హక్కు, కార్మిక సంఘాలు ఏర్పాటు చేసుకునే హక్కులు దెబ్బతింటున్నాయని అన్నారు.అదేవిధంగా రైతులు పండించిన పంటలకు చట్టబద్ధమైన గిట్టుబాటు ధర కల్పించాలని ఎన్నిసార్లు కోరినా కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. అమెరికాతో కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాల వల్ల దేశ రైతాంగానికి తీవ్ర నష్టం జరుగుతుందని ఆరోపించారు. పత్తి, మొక్క జొన్న, పాల ఉత్పత్తులు, కోడి కాళ్ల దిగుమతులకు సంబంధించిన ఒప్పందాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరిచి గ్రామీణ పేదలకు అన్యాయం చేస్తున్నారని వీబీజీ–రామ్‌జీ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. అలాగే నూతన విత్తన చట్టం, నూతన విద్యుత్ చట్టాల ద్వారా ప్రజలపై అదనపు భారాలు మోపుతున్నారని విమర్శించారు.భారత స్వాతంత్ర్య ఉద్యమంలో క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10న నిర్వహించే జైల్ భరో కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

## ఎమ్మెల్యే చొరవతో ప్రమాదకర గుంత పూడ్చివేత





**ఇల్లెందు, జులై 31 (ప్రజా జ్యోతి)** మండలంలోని బాలాజీ నగర్ గ్రామపంచాయతీ ప్రధాన రహదారి పక్కన ఉన్న ప్రమాదకర గుంతను ఎమ్మెల్యే కోరం కనకయ్య చొరవతో శుక్రవారం పూడ్చివేత పనులు ప్రారంభమయ్యాయి. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం కోసం తవ్విన గుంతను కాంట్రాక్టర్ వదిలేయడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ సమస్యను బాలాజీ నగర్ సర్పంచ్ పాయం స్వాతి, గ్రామ కార్యదర్శి కార్తీక్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఎమ్మెల్యే వెంటనే ఇల్లందు జియంతో మాట్లాడి గుంతలో మట్టి వేయించేలా చర్యలు తీసుకున్నారు. దీంతో మట్టిని నింపి రహదారిని సమతలపరిచే పనులు ప్రారంభమయ్యాయి. ప్రాణాపాయాన్ని తొలగించేలా వెంటనే స్పందించిన ఎమ్మెల్యే కోరం కనకయ్యకు గ్రామ ప్రజలు, సర్పంచ్ పాయం స్వాతి కృతజ్ఞతలు తెలిపారు. ఉప సర్పంచ్ ఈశ్వరమ్మ, వార్డు సభ్యులు, నాయకులు పాయం ఆంజనేయులు, తురుక విజయ్, చాంద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమ సహచరుడు పెద్ది సుదర్శన్ రెడ్డికి ఘన నివాళి



**టేకులపల్లి,జూలై 31,ప్రజాజ్యోతి:** తెలంగాణ ఉద్యమ సహచరుడు పెద్ది సుదర్శన్ రెడ్డి యశోద ఆసుపత్రిలో గత కొద్ది రోజులుగా చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి కన్నుమూశారని సమాచారం అందడంతో టేకులపల్లి మండలంలోని తెలంగాణ ఉద్యమకారులు, భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆయన చేసిన సేవలను స్మరించుకుంటూ ఉద్యమ సహచరులు తమ అనుభవాలను గుర్తు చేసుకున్నారు.ఈ సందర్భంగా టేకులపల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు, తెలంగాణ ఉద్యమకారుల ఆధ్వర్యంలో పెద్ది సుదర్శన్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి, కొవ్వొత్తులు వెలిగించి ఘనంగా నివాళులర్పించారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తామని, తెలంగాణ ఉద్యమంలో ఆయన చేసిన సేవలుచిరస్మరణీయమని పలువురు పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ టేకులపల్లి మండల మాజీ అధ్యక్షుడు తేజావత్ రవి నాయక్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఉద్యమ నాయకులు తేజావత్ వస్త్రం నాయక్, టేకులపల్లి సర్పంచ్ బోడ బాలు నాయక్, ఉపసర్పంచ్ అనంతుల వసంతలక్ష్మి, మహిళా అధ్యక్షురాలు ఆమెడ రేణుక, అప్పారావు, మాజీ ఎంపీటీసీ కొట్టే సురేష్, కుమ్మరి కిరణ్ కుమార్, మాలపూల రవి, నాగేశ్వరరావు, మురికి మహేష్‌బాబు, అమర్ సింగ్, తేజావత్ తేజా తదితరులు పాల్గొని పెద్ది సుదర్శన్ రెడ్డికి ఘనంగా నివాళులర్పించారు.

## రేగపై చిల్లర రాజకీయాలు మానుకోవాలి

- బీఆర్ఎస్ చర్ల మండల కమిటీ



**చర్ల, జూలై 31(ప్రజాజ్యోతి):** పినపాక నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు రేగ కాంతారావుకు ప్రజల్లో రోజురోజుకూ పెరుగుతున్న ఆదరణను చూసి అధికార పార్టీ నాయకులు చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ చర్ల మండల కమిటీ ఆరోపించింది.ఈ సందర్భగా శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో కమిటీ నాయకులు మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైనప్పటికీ రేగ కాంతారావు ప్రజల మధ్యే ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారని అన్నారు . ప్రజల్లో ఆయనకు లభిస్తున్న ఆదరణను తట్టుకోలేక కొందరు ఆయన రాజకీయ ప్రస్థానాన్ని అడ్డుకునేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు.ప్రతి మహిళను తన సోదరిగా భావిస్తూ వారి కష్టసుఖాల్లో అండగా నిలిచే నాయకుడు రేగ కాంతారావుపై నిరాధార ఆరోపణలు చే యడం చిల్లర రాజకీయాలకు పాల్పడడం సరికాదని మండల కమిటీ వారు అ న్నారు . అధికారం ఎవరికీ శాశ్వతం కాదని ప్రజా సమస్యలపై దృష్టి సారించి జల కోసం పనిచేయాలని అధికార పార్టీ నాయకులకు సూచించింది.రేగ కాంతారావుపై రాజకీయ కక్షతో వ్యవహరించడం మానుకోవాలని ప్రజా స్వామ్య విలువలను గౌరవించాలని బీఆర్ఎస్ చర్ల మండల కమిటీ డిమాండ్ చేసింది.

## కుదునూరు వద్ద రహదారిపై వరద నీరు

- చర్ల–భద్రాచలం మార్గం తాత్కాలికంగా మూసివేత
- ఆర్. కొత్తగూడెం మీదుగా వాహనాల మళ్లింపు



**చర్ల, జూలై 31(ప్రజాజ్యోతి):** గోదావరి నది ఉగ్రరూపం దాల్చడంతో చర్ల మండలం కుదునూరు గ్రామం వద్ద గోదావరి వరద నీరు రహదారిపైకి చేరి ప్రవహిస్తోంది. దీంతో ప్రజల భద్రత దృష్ట్యా చర్ల–భద్రాచలం ప్రధా న రహదారిని అధికారులు తాత్కాలికంగా మూసివేశారు.ఈ విషయాన్ని చర్ల సి ఐ ఆలెం రాజు వర్మ వెల్లడించా రు. వరద నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా చర్ల–భద్రాచలం మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలను ఆర్. కొత్తగూడెం మీదుగా మళ్లిస్తున్నట్లు తెలిపారు. వరద పరిస్థితి సాధారణ స్థితికి చేరుకునే వరకు ఈ మార్గంలో ఎవరూ ప్రయాణించవద్దని, పోలీసు, రెవెన్యూ అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు.గోదావరి వరద ఉధృతి కొనసాగుతున్న నేపథ్యంలో పరిస్థితిని అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన సహాయక భద్రతా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

## ఎర్రగుంట పీహెచ్‌సీ వైద్యాధికారిణిగా బాధ్యతలు చేపట్టిన నజ్ నిన్ తబసుమ్

- జూలూరుపాడు నుంచి బదిలీపై విధుల్లో చేరిక.. నాణ్యమైన వైద్య సేవలే లక్ష్యమని వెల్లడి



**అన్నపురెడ్డిపల్లి, జులై 31 (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిణిగా డాక్టర్ నజ్ నిన్ తబసుమ్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె జూ లూరుపాడు నుంచి బదిలీపై ఎర్రగుంట పీహెచ్‌సీకి వచ్చారు. మాట్లాడుతూ మండ ల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అం దించడమే తన తొలి ప్రాధాన్యత అని తెలిపారు. ఆసుపత్రిలో మందుల కొరత లేకుండా చూడటంతో పాటు సిబ్బంది సమయపాలనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా కృషి చేస్తానని ఆమె తెలిపారు. అనంతరం నూతనంగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ నజ్ నిన్ తబసుమ్‌కు ఆసుపత్రి సిబ్బంది బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

# గోదావరి వరదలో చిక్కుకున్న 55మంది డ్రైవర్లు

- నదిలో నలబై లారీలు






**చర్ల, జూలై 31(ప్రజాజ్యోతి):** చర్ల మండలం వీరాపురం గ్రామ పరిధిలోని ఇసుక ర్యాంపులో శుక్రవారం సాయంత్రం గోదావరి నదికి అకస్మాత్తుగా వరద ఉధృతి పెరగడంతో ఇసుక లోడింగ్ పనుల కోసం ర్యాంపుకు వచ్చిన లారీలు, వాటి డ్రైవర్లు, ఆపరేటర్లు కలిపి మొత్తం 55 మంది వరద నీటిలో చిక్కుకుపోయారు.గోదావరి నీటి ప్రవాహం ఒక్కసారిగా పెరగడంతో ర్యాంపు చుట్టూ నీరు చేరి అక్కడ ఉన్నవారు బయటకు వచ్చే పరిస్థితి లేకపోయింది. స్థానికుల నుండి విషయం తెలుసుకున్న వెంటనే రెవెన్యూ, పోలీసు, ఇసుక ర్యాంపు నిర్వాహకులు స్థానిక అధికారులు అప్రమత్తమై సహాయక చర్యలను ప్రారంభించారు.ముందుగా గజ ఈతలో నైపుణ్యం కలిగిన ఈతగాళ్లను రంగంలోకి దింపి గోదావరిలో చిక్కుకున్న 15 మందిని అత్యంత జాగ్రత్తగా సురక్షితంగా ఒడ్డుకు తరలించారు. మిగిలిన 40 మందిని చర్ల సిఐ రాజు వర్మ భారీ యంత్రాలతో సాయంతో వారిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు.ర్యాంపులో ఉన్న లారీలను వరద నీటి నుంచి రక్షించేందుకు మెరక ప్రాంతానికి తరలించే చర్యలు అధికారులు చేపట్టారు. వరద నీటి ప్రవాహం కొనసాగుతున్న నేపథ్యంలో అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గోదావరి నది వరద ఉదృతి వలన పరిసర ప్రాంతాలకు వెళ్లవద్దని అధికారుల సూచించారు. గోదావరిలో చిక్కుకున్న లారీ డ్రైవర్లను,ఆపరేటర్లను లారీలను సురక్షితంగా బయటికి చేర్చిన చర్ల సీఐ రాజు వర్మ ,ఎస్ ఐ నర్సిరెడ్డి ,తాసిల్దార్ శ్రీనివాస్ ఎంపీడీవో ఈదయ్యను అధికారులను గ్రామస్తులు అభినందించారు.ఈ సహాయక చర్య ల్లో మండల తాసిల్దార్ శ్రీనివాస్ ,ఎంపీడీవో ఈదయ్య చర్ల సీఐ రాజు వర్మ, ఎస్సై నర్సిరెడ్డి ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చర్లకు చేరుకున్న శ్రీరామ హృదయ కలశం



**చర్ల, జూలై 31 (ప్రజాజ్యోతి):** శ్రీశ్రీ చిన్నజీయర్ స్వామి వారి 70వ వసంతోత్సవాల సందర్భంగా చేపట్టిన శ్రీరామ హృదయ కలశం కార్యక్రమంలో భాగంగా కలశం శుక్రవారం చర్ల మండలానికి చేరుకుంది. ఈ సందర్భంగా వికాస తరంగిణి చర్ల మండల బాధ్యులు గుంజి పురుషోత్తం ఆధ్వర్యంలో భక్తులు ఘనంగా స్వాగతం పలికారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి మనిషిలో శ్రీరాముడి ఆదర్శాలు, ధర్మబుద్ధి, కరుణ వంటి గుణాలు నింపాలనే సంకల్పంతో శ్రీరామ హృదయ కలశం యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి భక్తుడు తన వంతుగా ఒక గుప్పెడు బియ్యాన్ని కలశంలో సమర్పించి లోకకల్యాణం, సర్వజన సుఖశాంతి కోసం ప్రార్థించాలని పిలుపునిచ్చారు.శ్రీరామ హృదయ కలశం చర్ల మండలంలో 10 రోజుల పాటు భక్తుల దర్శనార్థం అందుబాటులో ఉంటుందని మండలంలోని భక్తులు కలశాన్ని దర్శించి, స్పర్శించి ఆధ్యాత్మిక అనుభూతిని పొందాలని సూచించారు. అలాగే గ్రామాల ప్రజలు, ఆలయ కమిటీల కోరిక మేరకు మండలంలోని ప్రముఖ దేవాలయాలకు కూడా కలశాన్ని తీసుకెళ్లే ఏర్పాట్లు చేయనున్నట్లు అన్నారు.ఈ కార్యక్రమంలో చర్ల లోని పలు ఆలయాల ధర్మకర్తలు సాంబయ్య, ఆంజనేయులు, ఆర్ ఎస్ కిరాణా శ్రీను, మహిళా భక్తులు రాణి , భారతి , సత్తిబాబు, వెంకటేశ్వరరావు, వీర్రాజు, అశోక్ , చర్ల మండల ధర్మ రక్షణ సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పర్యవేక్షక పోస్టులను ఉపాధ్యాయులతోనే భర్తీ చేయాలి

- డాక్టర్ గరికే శ్రీనివాస్



**ములకలపల్లి, జూలై 31, ప్రజాజ్యోతి:** గిరిజన సంక్షేమ శాఖలో ఏటీడీఓ, డీటీఓ, డీడీ, జేడీ వంటి పర్యవేక్షక పోస్టులను నాలుగో తరగతి ఉద్యోగులతో కాకుండా, 95 శాతం ఉన్న ఉపాధ్యాయులకు పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి, హ్యూమన్ రైట్స్ జిల్లా చైర్మన్ డాక్టర్ గరికె శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.నాలుగో తరగతి ఉద్యోగులకు ఈ పోస్టుల్లో అవకాశం కల్పించడం వల్ల విద్యా పరిపాలనపై ప్రతికూల ప్రభావం పడుతుందని ఆయన అన్నారు. విద్యార్థుల మనస్తత్వం, బోధనా విధానాలు, పాఠశాలల నిర్వహణపై ప్రత్యక్ష అనుభవం ఉన్న ఎస్‌జీటీలు, స్కూల్ అసిస్టెంట్లు, పీజీటీలు, ప్రధానోపాధ్యాయులకే ఈ పోస్టుల్లో పదోన్నతులు ఇవ్వాలని కోరారు. ఇలా చేయడం వల్ల గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడంతో పాటు ఆశ్రమ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని డాక్టర్ గరికె శ్రీనివాస్ పేర్కొన్నారు. ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించి పర్యవేక్షక బాధ్యతలు అప్పగించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

## కాచనపల్లి ఘాట్‌రోడ్డులో మరిన్ని రిఫ్లెక్టర్ బోర్డులు ఏర్పాటు చేయాలి

- పోలీసుల సేవలకు ప్రశంసలు..
- బాటన్నగర్ - మామకన్ను మార్గంలో భద్రతా చర్యలు విస్తరించాలని ప్రజల విజ్ఞప్తి

**ఆళ్ళపల్లి,జూలై 31(ప్రజా జ్యోతి)** ఆళ్ళపల్లి మండలంలోని కాచనపల్లి గ్రామ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజల రక్షణ కోసం పోలీసులు అందిస్తున్న సేవలు అభినందనీయమని గ్రామస్తులు కొనియాడారు. గ్రామంలో ఎలాంటి సమస్య తలెత్తినా పోలీసులు వెంటనే స్పందిస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్నారని వారు పేర్కొన్నారు.ఇటీవల (ఆర్ఎంబీ) సహకారంతో, స్థానిక పోలీసుల పర్యవేక్షణలో బాటన్నగర్ సమీపంలోని ప్రమాదకర మూలమలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం వల్ల వాహనదారులకు ఎంతో ఉపయోగకరంగా మారిందని స్థానికులు తెలిపారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఈ బోర్డులు ప్రమాదాలను నివారించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు.అయితే బాటన్నగర్ నుంచి మామకన్ను వరకు ఉన్న ప్రధాన రహదారిలో ఇంకా అనేక ప్రమాదకర మూలమలుపులు ఉన్నాయని, అక్కడ కూడా రాత్రి వేళల్లో స్పష్టంగా కనిపించే రెడ్/వైట్ రిఫ్లెక్టర్ బోర్డులు, రిఫ్లెక్టివ్ స్టిక్కర్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు. ప్రమాదాలను నివారించే దిశగా మరో 10 నుంచి 20 రిఫ్లెక్టర్ బోర్డులను తక్షణమే ఏర్పాటు చేయాలని కోరారు.ఈ మేరకు ఆర్ఎంబీ మరింత చొరవ తీసుకుని అవసరమైన సహకారం అందించాలని, పోలీసుల సమన్వయంతో మిగిలిన ప్రమాదకర మూలమలుపుల వద్ద కూడా భద్రతా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని కాచనపల్లి గ్రామస్తులు,ఆళ్ళపల్లి మండల ప్రజలు, స్థానిక ఆదివాసులు, వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు ఏకగ్రీవంగా విజ్ఞప్తి చేశారు. ప్రజల ప్రాణాలను కాపాడే ఈ కార్యక్రమానికి అధికారులు, ఆర్ఎంబీ ప్రతినిధులు, దాతలు ముందుకు రావాలని వారు కోరారు.





# ప్రజా సమస్యలపై సమరశంఖం

- కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజల్లో చైతన్యం కల్పిస్తాం
- సెప్టెంబర్ 1న 'చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
- జిల్లాలో సాగునీరు, పోడు పట్టాలు, పేదల ఇళ్ల కోసం ఉద్యమం కొనసాగుతుంది
- ఆగస్టు 6 నుంచి ప్రజా చైతన్య యాత్రలు : కూనంనేని




**పాల్వంచ, జూలై 31, (ప్రజాజ్యోతి):** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పార్టీ శ్రేణులు, ప్రజలు సమరశంఖం పూరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. శుక్రవారం పాల్వంచలోని సీఆర్ భవన్‌లో జరిగిన సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల, పట్టణ కార్యదర్శులు, ప్రజాసంఘాల జిల్లా బాధ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేయడంలో, నిరుద్యోగులకు ఉపాధి కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రైతులకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధ హామీ కల్పించాలని, కార్మికుల హక్కులను పరిరక్షించాలని, ఎన్నికలను బ్యాలెట్ పేపర్ విధానంలో నిర్వహించాలని డిమాండ్ చేశారు. జంతర్ మంతర్ వద్ద యువత చేపట్టిన ఉద్యమం చారిత్రాత్మక విజయమని, జెంజి ఉద్యమం దేశ చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిందన్నారు. దళితులు, ఆదివాసీలపై దాడులను అరికట్టి పేదలకు విద్య, వైద్యం అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఈ అంశాలపై రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు 6 నుంచి 14వరకు ప్రజా చైతన్య యాత్రలు నిర్వహించనున్నట్లు, సెప్టెంబర్ 1న 'చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కే. సాబీర్ పాషా మాట్లాడుతూ సీతారామ, సీతమ్మధార ప్రాజెక్టుల ద్వారా జిల్లా రైతాంగానికి సాగునీరు అందించాలని, పెండింగ్‌లో ఉన్న పోడు పట్టాలను పంపిణీ చేసి పేదలకు ఇళ్లు, ఇంటి స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు నిర్వాసితులకు న్యాయమైన పరిహారం చెల్లించాలని, పాల్వంచలో 800 మెగావాట్ల సామర్థ్యంతో రెండు విద్యుత్ ప్లాంట్ల నిర్మాణం చేపట్టాలని కోరారు. కాంట్రాక్టు, స్కీమ్ వర్కర్లకు ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు అమలు చేయాలని, ఖాళీ ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఆగస్టు 6 నుంచి 12 వరకు ప్రజా చైతన్య యాత్రలు నిర్వహించి ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర, జిల్లా నాయకులు, మండల, పట్టణ కార్యదర్శులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## పెద్ది సుదర్శన్‌రెడ్డి మృతి బీఆర్ఎస్‌కు తీరని లోటు

- మాజీ ఎమ్మెల్యే మెచ్చా
- అంతిమయాత్రలో పాల్గొన్న మెచ్చా నాగేశ్వరరావు..
- ఉద్యమ స్ఫూర్తిని కొనియాడిన దొడ్డా రమేష్





**దమ్మపేట, జూలై 31(ప్రజాజ్యోతి):** తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు, నర్సంపేట మాజీ శాసనసభ్యుడు పెద్ది సుదర్శన్‌రెడ్డి హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం కన్నుమూయడం అత్యంత బాధాకరమని బీఆర్ఎస్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మరణం తెలంగాణ ఉద్యమానికి, బీఆర్ఎస్ పార్టీకి, నర్సంపేట నియోజకవర్గ ప్రజలకు తీరని లోటని పేర్కొన్నారు. శుక్రవారం నర్సంపేటలో జరిగిన పెద్ది సుదర్శన్‌రెడ్డి అంతిమయాత్రలో అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి మెచ్చా నాగేశ్వరరావు పాల్గొని ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మెచ్చా నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన మలిదశ ఉద్యమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఉద్యమానికి పెద్ది సుదర్శన్‌రెడ్డి కీలక నాయకత్వం వహించారని గుర్తు చేశారు. తెలంగాణనే శ్వాసగా భావిస్తూ నీతి, నిజాయితీతో ప్రజా జీవితాన్ని గడిపిన ఆయన రాజకీయ ప్రస్థానం ఆదర్శప్రాయమని కొనియాడారు. పోరాటాల ఖిల్లాగా పేరొందిన నర్సంపేట గడ్డపై బీఆర్ఎస్ గులాబీ జెండాను ఎగురవేసి మొక్కవోని ధైర్యంతో ఉద్యమాన్ని ముందుకు నడిపించిన ధీరుడిగా ఆయన చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమం నుంచి చివరి శ్వాస వరకు పార్టీ జెండా నీడలోనే నడిచిన పెద్ది సుదర్శన్‌రెడ్డి అటు ఉద్యమంలోనూ, ఇటు నర్సంపేట నియోజకవర్గ అభివృద్ధిలోనూ చెరగని ముద్ర వేశారని అన్నారు. పార్టీ పట్ల ఆయన చూపిన విధేయత, ప్రజా సేవా తపన, నాయకత్వ లక్షణాలు కార్యకర్తలకు ఎల్లప్పుడూ స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. పోలీసుల ఒత్తిళ్లు, నాన్ బెయిలబుల్ కేసులు, జైలు నిర్బంధాలను సైతం లెక్కచేయకుండా ఉద్యమించిన ఆయన ధైర్యసాహసాలు తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తాయని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ దమ్మపేట మాజీ మండల అధ్యక్షుడు దొడ్డా రమేష్ ఒక ప్రకటనలో పెద్ది సుదర్శన్‌రెడ్డి మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన చేసిన ప్రజాసేవ, ఉద్యమ స్ఫూర్తి, పార్టీ పట్ల అంకితభావం కార్యకర్తలకు ఆదర్శమని పేర్కొన్నారు. దివంగత పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబ సభ్యులకు మెచ్చా నాగేశ్వరరావు, దొడ్డా రమేష్ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ఆ కుటుంబానికి భగవంతుడు ప్రసాదించాలని ప్రార్థిస్తూ, దివంగత నేత ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

## మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు దిష్టిబొమ్మ దహనం

- రేగా కాంతారావు పై ఆరోపణల నేపథ్యంలో చట్టపరమైన చర్యలు తీసుకోవాలి
- బాధితురాలికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తాం
- పాల్వంచలో బీజేపీ నిరసన, రేగా కాంతారావుపై నమోదైన కేసులో నిష్పక్షపాత విచారణకు డిమాండ్
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి

**పాల్వంచ, జూలై 31, ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీజేపీ అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో పాల్వంచ అంబేద్కర్ సెంటర్‌లో మాజీ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావుపై హైదరాబాద్ పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కావడం తీవ్ర ఆందోళన కలిగించే విషయమని పేర్కొన్నారు. నమోదైన కేసులో ఉన్న ఆరోపణలపై పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు నిర్వహించి, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రియల్ ఎస్టేట్ పెట్టుబడుల పేరుతో ఒక యువతి నుంచి భారీ మొత్తంలో డబ్బులు తీసుకుని మోసం చేయడం, అలాగే వివాహం చేసుకుంటానని నమ్మించి లైంగిక వేధింపులకు పాల్పడ్డారనే ఆరోపణలు అత్యంత తీవ్రమైనవని ఆయన అన్నారు. ఇలాంటి ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే, ఈ ఆరోపణల నేపథ్యంలో రేగా కాంతారావును బీఆర్ఎస్ పార్టీ నుంచి వెంటనే సస్పెండ్ చేయాలని, బాధితురాలికి పూర్తి స్థాయిలో న్యాయం చేయడంతో పాటు అవసరమైన పోలీసు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. రాజకీయ ప్రభావంతో కేసు దర్యాప్తును ప్రభావితం చేసే ప్రయత్నాలు జరిగితే బీజేపీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, బాధితురాలికి న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, మహిళా మోర్చా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## డిమాండ్ల సాధనకు పెన్ డౌన్

- ప్రభుత్వాన్ని హెచ్చరించిన వీబీ-గ్రామ్ జీ ఉద్యోగులు
- దమ్మపేటలో రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు నిరసన
- ఆగస్టు 15లోగా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



**దమ్మపేట, జూలై 31(ప్రజాజ్యోతి):** రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో పనిచేస్తున్న ఎస్ ఆర్ డీఎస్ (వీబీ-గ్రామ్ జీ) ఉద్యోగులు (ఎఫ్ టీఈలు) శుక్రవారం దమ్మపేట మండలంలో పెన్ డౌన్ కార్యక్రమం నిర్వహించి నిరసన తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరుతూ విధులను బహిష్కరించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో పనిచేస్తున్న ఎఫ్ టీఈ ఉద్యోగుల సమస్యలను ఆగస్టు 15లోగా పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ తదితర అధికారులకు వినతిపత్రాలు సమర్పించినట్లు తెలిపారు. గత ఏడాది నుంచి జీతాల చెల్లింపులు తీవ్రంగా ఆలస్యం కావడంతో ఉద్యోగులు, వారి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి అద్దెలు, బ్యాంకు రుణాల నెలవారీ వాయిదాలు, పిల్లల చదువులు, వైద్య ఖర్చులు, కుటుంబ పోషణ వంటి కనీస అవసరాలను కూడా తీర్చుకోలేని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. గతంలో ప్రభుత్వం పలు హామీలు ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు వాటి అమలుపై స్పష్టత లేదని విమర్శించారు. ఉద్యోగుల ప్రధాన డిమాండ్లలో ఆగస్టు 15లోగా పూర్తిస్థాయి క్రమబద్ధీకరణ ప్రక్రియ ప్రారంభించడం, ప్రతి నెలా నిర్ణీత తేదీన జీతాలు చెల్లించడం, పెండింగ్ లో ఉన్న వేతన బకాయిలను విడుదల చేయడం, ఎస్ ఆర్ డీఎస్ కమిటీ సిఫార్సులను అమలు చేయడం, ఉద్యోగ సేవా నిబంధనలను రూపొందించడం, కేడర్ బలోపేతం, పదోన్నతులు, బదిలీలు, ఇతర పరిపాలనా సమస్యలను పరిష్కరించడం ఉన్నాయని తెలిపారు. ఆగస్టు 15లోగా ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించకపోతే ఆగస్టు 16 నుంచి రాష్ట్రవ్యాప్తంగా దశలవారీ ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా జేఏసీ అధ్యక్షుడు వేముల సుధాకర్, జిల్లా జేఏసీ కోశాధికారి జీడీఆర్ పట్నాయక్, జిల్లా టెక్నికల్ అసిస్టెంట్స్ అసోసియేషన్ కోశాధికారి రాఘవరావు, జూనియర్ ఇంజినీర్ స్వామి, టెక్నికల్ అసిస్టెంట్లు నాగమణి, లక్ష్మయ్య, సిందూరి, కమ్యూనిటీ ఆర్గనైజర్ బాబా తదితరులు పాల్గొన్నారు.

## శ్రావణ మాసం వేడుకలకు ముస్తాబవుతున్న ముత్యాలమ్మ ఆలయ పరిసరాలు



**టేకులపల్లి, జూలై 31, ప్రజా జ్యోతి:** రానున్న శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని టేకులపల్లి మండలంలోని బోడ బజార్ శ్రీ ముత్యాలమ్మ ఆలయం, పోస్ట్ ఆఫీస్ సెంటర్, బోడు రోడ్డు పరిసరాల్లో సర్పంచ్ బోడ బాలు ఆధ్వర్యంలో మొరం తోలకం పనులు చేపట్టారు. శ్రావణ మాసంలో ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరిసరాలను పరిశుభ్రంగా, సౌకర్యవంతంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు గుడిపూడి సత్యనారాయణ, ఇస్లావత్ మంగ నాయక్, అయితా శ్రీరాములు, నోముల భాస్కర్, తోటకూరి రామారావు తదితరులు పాల్గొని శ్రమదానం చేసి పనులను విజయవంతంగా నిర్వహించారు.

# కామ కాంతారావు.. ప్రేమ, పెళ్లి హామీ..!

- పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావుపై యువతి ఫిర్యాదు..
- పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు
- ఎఫ్ఐఆర్ లో ప్రేమ, పెట్టుబడి, బెదిరింపుల ఆరోపణలు..
- అన్ని కోణాల్లో దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూలై 31, ప్రజాజ్యోతి**

జిల్లాలోని పినపాక నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత రేగా కాంతారావుపై హైదరాబాద్‌లోని పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఓ యువతి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఫిర్యాదులో ప్రేమ, పెళ్లి హామీ, లైంగిక వేధింపులు, బ్లాక్‌మెయిల్, రియల్ ఎస్టేట్ పెట్టుబడి పేరుతో డబ్బులు తీసుకోవడం వంటి పలు ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ ఆరోపణలన్నింటినీ పోలీసులు విచారిస్తున్నారు. ఎఫ్ఐఆర్ లో నమోదైన ఫిర్యాదు ప్రకారం, 2022లో ఉద్యోగం కోసం హైదరాబాద్‌కు వచ్చిన యువతికి స్నేహితుల ద్వారా అప్పటి ఎమ్మెల్యేగా ఉన్న రేగా కాంతారావుతో పరిచయం ఏర్పడింది. ఆ సమయంలోనే యూట్యూబ్ ఛానెల్ ప్రారంభిస్తానని, దాని నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తానని చెప్పి తనకు కాంతారావు దగ్గరయ్యారని తెలిపింది. అనంతరం ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని అతను నమ్మించాడని యువతి ఆరోపించింది. తాను ఇప్పటికే వివాహితుడినే అయినప్పటికీ భార్యతో విభేదాల కారణంగా వేరుగా ఉంటున్నానని చెప్పడంతో అతని మాటలు నమ్మినట్లు ఫిర్యాదులో పేర్కొంది. ఇక అక్కడి నుండి పరిచయం క్రమంగా సన్నిహిత సంబంధంగా మారిందని, అయితే కొంతకాలం తర్వాత పెళ్లి విషయమై ప్రశ్నించగా రేగా కాంతారావు తప్పించుకోవడం ప్రారంభించారని ఆరోపించింది. అప్పటి నుండి తనను కొంత దూరం పెట్టినట్టు అందులో పేర్కొంది. దీంతో అతను బెదిరింపులకు పాల్పడ్డారని, ఇద్దరూ కలిసి ఉన్న సమయంలో రహస్యంగా తీసిన ఫోటోలు, వీడియోలు బయటపెడతానంటూ బ్లాక్‌మెయిల్ చేశారని కూడా ఫిర్యాదులో పేర్కొంది. ఈ పరిస్థితి గత ఏడాది జూన్ వరకు కొనసాగిందని ఆరోపించింది. అయితే ఇదే సమయంలో రియల్ ఎస్టేట్ పెట్టుబడుల్లో అధిక లాభాలు వస్తాయని నమ్మించి కొంత డబ్బులు తీసుకున్నారని, ఆ డబ్బు తిరిగి ఇవ్వలేదని కూడా ఫిర్యాదులో ఆరోపించింది. అదే సమయంలో తన మొబైల్ ఫోన్‌లోని పరిచయాల వివరాలను అనుమతి లేకుండా తీసుకుని ఇతర మహిళలను కూడా సంప్రదించేందుకు ప్రయత్నించారని ఆరోపించింది. అయితే ఫిర్యాదు ప్రకారం, తొలుత బాధితురాలు షీ–టీమ్స్‌కు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసింది. అనంతరం ఆర్థిక ఇబ్బందులు ఎదురుకావడంతో బంధువుల సహాయంతో తనకు రావాల్సిన డబ్బు తిరిగి ఇప్పించాలని ప్రయత్నించినట్లు పేర్కొంది. ఈ క్రమంలో రేగా కాంతారావు సోషల్ మీడియా నిర్వాహకుడిని సంప్రదించగా, అనంతరం ఆయన స్నేహితుడిగా చెప్పబడుతున్న ఓ కాంట్రాక్టర్ ద్వారా రూ.5 లక్షలు తన బ్యాంకు ఖాతాలో జమ అయినట్లు ఫిర్యాదులో వివరించింది. మరోవైపు, షీ–టీమ్స్ తనను సంప్రదించిన సమయంలో యువతి డబ్బుల కోసం బెదిరింపులకు పాల్పడుతోందని రేగా కాంతారావు తెలిపినట్లు ఎఫ్ఐఆర్ లో ప్రస్తావన ఉంది. అలాగే కాంట్రాక్టర్ ద్వారా పంపిన నగదుకు సంబంధించిన బ్యాంకు ఖాతా వివరాలను కూడా పోలీసులకు అందజేసినట్లు నమోదు చేశారు. ఈ అంశాలను కూడా పోలీసులు దర్యాప్తులో భాగంగా పరిశీలించే అవకాశం ఉంది. ఈ కేసులో ఇరువైపుల వాదనలను పరిశీలించిన అనంతరం మాత్రమే వాస్తవ పరిస్థితి స్పష్టమవుతుందని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం పంజాగుట్ట పోలీసులు ఎఫ్ఐఆర్ లో పేర్కొన్న ప్రతి ఆరోపణను పరిశీలిస్తూ సాక్ష్యాలు, డిజిటల్ ఆధారాలు, ఆర్థిక లావాదేవీలు, సంబంధిత వ్యక్తుల వాంగ్మూలాలను సేకరించే ప్రక్రియలో ఉన్నట్లు సమాచారం.

## గ్రామాభివృద్ధికి ప్రజలే దిక్సూచి

- సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు
- దమ్మపేటలో జీపీడీపీ గ్రామసభ
- గ్రామాభివృద్ధికి మూడేళ్ల కార్యాచరణకు గ్రామసభ ఆమోదం



**దమ్మపేట, జూలై 31(ప్రజాజ్యోతి):** గ్రామ అవసరాలకు అనుగుణంగా రానున్న మూడు సంవత్సరాల అభివృద్ధి ప్రణాళిక రూపొందించేందుకు దమ్మపేట గ్రామపంచాయతీలో శుక్రవారం గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ) గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గ్రామాభివృద్ధికి సంబంధించి ప్రజల నుంచి విస్తృతంగా సూచనలు, ప్రతిపాదనలు స్వీకరించారు.గ్రామసభలో గ్రామంలోని మౌలిక సదుపాయాల మెరుగుదలపై ప్రధానంగా చర్చించారు. ఐదు కిలోమీటర్ల సీసీ రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ విస్తరణ, కల్వర్టులు, వంతెనలు, పది కిలోమీటర్ల మంచినీటి పైప్‌లైన్, ఓవర్‌హెడ్ ట్యాంకుల మరమ్మతులు, 1,500 ఎల్‌ఈడీ వీధి దీపాల ఏర్పాటు, 2,000 కొత్త తాగునీటి కనెక్షన్లు, డంపింగ్ యార్డులో మరుగుదొడ్లు, కమ్యూనిటీ హాల్, శానిటరీ కాంప్లెక్స్, స్మశానవాటిక అభివృద్ధి, పాఠశాలలకు కాంపౌండ్ వాల్లు, రైతుల కోసం ఫామ్‌పాండ్లు, ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఇంకుడు గుంతలు, గ్రామంలో ప్లాస్టిక్ నిషేధం వంటి పలు అభివృద్ధి ప్రతిపాదనలను గ్రామసభ ఏకగ్రీవంగా ఆమోదించింది.గ్రామసభలో ఆమోదించిన ప్రతిపాదనలను 'నిర్ణయ్' యాప్‌లో ఫొటోలు, వీడియోలతో అప్‌లోడ్ చేయడం ద్వారా పంచాయతీరాజ్ శాఖకు పంపనున్నట్లు కార్యదర్శి బండి అనంత్‌కుమార్ తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో రూపొందించిన ప్రణాళికలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు.భగీరథ నీటి నాణ్యతపై కొందరు గ్రామస్థులు సందేహాలు వ్యక్తం చేయగా, ప్రభుత్వం శుద్ధి చేసిన సురక్షితమైన తాగునీటినే సరఫరా చేస్తోందని అధికారులు వివరించారు. అలాగే 2026 జనవరి నుంచి జూన్ వరకు గ్రామంలో తాగునీటి మోటార్ల విద్యుత్ బిల్లులకే రూ.54 లక్షలు ఖర్చు అయినట్లు వెల్లడించారు.ఈ గ్రామసభలో ఉపసర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు, వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, దారా రాము, రూపా రాంబాబు, బత్తుల సాయి, పసుమర్తి కుసుమాంబ, దాసరోజు సరిత రామారావు, పూనెం పోలమ్మతో పాటు గ్రామస్థులు చిన్నశెట్టి యుగంధర్, ముక్తేశ్వర రావు, గోపి, పిట్టల శ్రీనివాసరావు, గట్ల నాగరాజు తదితరులు పాల్గొని గ్రామాభివృద్ధికి తమ అభిప్రాయాలు వెల్లడించారు.

## గోదావరి వరద పరివాహక ప్రాంతాన్ని పరిశీలించిన అధికారులు



**పినపాక,జూలై 31(ప్రజాజ్యోతి )** పినపాక మండలం టీ కొత్తగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని గోదావరి వరద పరివాహక ప్రాంతాన్ని అధికారులు పరిశీలించారు. శుక్రవారం మండల తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి,ఎంపీడీవో సంకీర్త్, ఎస్ఐ సురేష్ పరిశీలించారు. గోదావరి నీటి మట్టం, వరద పరిస్థితులు, లోతట్టు ప్రాంతాల పరిస్థితిని, స్వయంగా పరిశీలించి సంబంధిత సిబ్బందికి అప్రమత్తంగా ఉండాలని సూచించారు.వరద ముప్పు ఉన్న ప్రాంతాల ప్రజలను అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని అధికారులకు ఆదేశించారు. గ్రామ ప్రజలు గోదావరి ఒడ్డుకు వెళ్లకుండా, అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. ఎలాంటి అత్యవసర పరిస్థితి తలెత్తినా వెంటనే రెవెన్యూ, పోలీసు అధికారులకు సమాచారం అందించాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ ఇన్స్పెక్టర్ శ్యాంసుందర్, జి పి ఓ లు, సెక్రటరీలు, తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో మృతి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు ఆర్థిక సాయం

- బీఆర్ఎస్ నాయకులు పోలిశెట్టి సత్తిబాబు





**పినపాక, జూలై 31(ప్రజాజ్యోతి):** పినపాక మండలంలోని ఏల్చిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీకి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు గోతం మనోజ్ బాబాయి గోతం శ్రీను అనారోగ్య కారణాలతో మృతి చెందారు.అలాగే జగ్గారం గ్రామపంచాయతీ వెంకటేశ్వరపురం గ్రామానికి చెందిన గుంటుపల్లి బాబురావు మృతి చెందిన విషయం తెలుసుకున్న వెంటనే బీఆర్ఎస్ పార్టీ పినపాక మండల ప్రధాన కార్యదర్శి పోలిశెట్టి సత్తిబాబు మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా దహన సంస్కారాల నిమిత్తం తన వంతు సహాయంగా గోతం శ్రీను కుటుంబ సభ్యులకు రూ.3,000 నగదును, 2000 రూపాయలు బాబురావు కుటుంబ సభ్యులకు స్థానిక ఉపసర్పంచ్ అశోక్ చేతులమీదుగా అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని, ఈ కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని ఆయన సూచించారు.

## చందా కాంతారావుకు ఘన సన్మానం

- పదవీ విరమణ సందర్భంగా సేవలను కొనియాడిన అధికారులు



**పినపాక,జూలై 31(ప్రజాజ్యోతి)** చందా కాంతారావు పదవీ విరమణ సందర్భంగా నిర్వహించిన సన్మాన కార్యక్రమం పినపాక మండలం జివిఆర్ ఫంక్షన్ హాల్ లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, శ్రేయోభిలాషులు హాజరై ఆయన ప్రభుత్వ సేవలను ప్రశంసించారు. మణుగూరు మండల వ్యవసాయ విస్తరణ అధికారి డాక్టర్ కొమరం లక్ష్మణరావు మాట్లాడుతూ, చందా కాంతారావు ఉద్యోగ జీవితమంతా అంకితభావం, నిజాయితీ, క్రమశిక్షణతో విధులు నిర్వహించి అందరికీ ఆదర్శంగా నిలిచారని అన్నారు. ప్రభుత్వ సేవలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొంటూ, పదవీ విరమణ అనంతరం కూడా సమాజ సేవలో చురుకుగా కొనసాగాలని ఆకాంక్షించారు. అనంతరం డాక్టర్ కొమరం లక్ష్మణరావు శాలువాతో చందా కాంతారావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, సహచరులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.